సాక్షి బాపట్ల

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



40,878 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 40,878 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 35,198 బస్తాల అమ్మకాలు జరిగాయి.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో 37.55 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు. ఇది 169 అడుగులకు సమానం. పవర్ జనరేషన్‌కు 12వేల క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5,527 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 292 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

ఢిల్లీ స్వాతంత్య్ర వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 15న జరగనున్న స్వాతంత్య్ర వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఆమె భర్త కత్తెర సురేష్‌కుమార్ పాల్గొననున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందినట్లు హెనీ క్రిస్టినా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పంచాయతీరాజ్ సంస్థల తరఫున ఢిల్లీలో జరగనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న హెనీ క్రిస్టినా ఈనెల 14న ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. ఆ తర్వాత తీన్‌మూర్తి మార్గంలోని ప్రధానమంత్రి సంగ్రహాలయ సందర్శన కార్యక్రమంలో పాల్గొంటారు. 15న ఎర్రకోటలో నిర్వహించే జాతీయ పతాక ఆవిష్కరణ వేడుకల్లో పాల్గొంటారు.

ఏఎన్‌యూకు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్

ఏఎన్‌యూ(గుంటూరు): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్–2024) సోమవారం సాయంత్రం విడుదల చేసిన ర్యాంకులలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్థానం దక్కించుకుంది. ఇందులో ఓవరాల్ యూనివర్సిటీ కేటగిరీలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 97వ స్థానాన్ని పొందింది. స్టేట్ యూనివర్సిటీ కేటగిరీలో 20వ ర్యాంకును దక్కించుకుంది. ఫార్మసీ కళాశాలల విభాగంలో 63వ ర్యాంకును సాధించింది. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ గంగాధరరావు, రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ జి. సింహాచలం హర్షం వ్యక్తం చేశారు.

రేపు సెంట్రల్ ఎక్సైజ్ పెన్షన్ అదాలత్


లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలోని సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ టాక్స్, సెంట్రల్ జీఎస్టీ శాఖలలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ సమస్యల పరిష్కారానికి పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గద్దె తిలక్, టి.వివేకానంద ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు కన్నావారితోటలోని కేంద్ర జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు పెన్షన్ అదాలత్ సమావేశం జరుగుతుందని తెలిపారు. పెన్షనర్లు తమ సమస్యలు, ఫిర్యాదులను పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చునని పేర్కొన్నారు. ఈ అదాలత్‌లో కస్టమ్స్ అండ్ సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పాల్గొని పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తారని వివరించారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: నగరంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం రూరల్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు రిఫ్రెష్ ట్రైనింగ్ ప్రోగ్రాం(శిక్షణ తరగతులు) నిర్వహించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వసంతరాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, చేపట్టాల్సిన కార్యచరణపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచనలు చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్యం తదితర సౌకర్యాల కల్పనపై చర్చించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదినారాయణ, ఈఓపీఆర్డీ శ్రీనివాస రావు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి కారుణ్య నియామక ఉత్తర్వులు

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్: ముగ్గురు నిరుద్యోగులకు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆడిట్, పోలీస్, డ్వామా శాఖల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగం బాధ్యతగా చేసుకోవాలని ఈ సందర్భంగా జేసీ వారికి వివరించారు. డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తీరంలో సీఆర్‌జెడ్

విస్తరణకు కసరత్తు

- నిబంధనలకు విరుద్ధంగా పలు రిసార్టుల నిర్మాణం
- సీఆర్‌జెడ్‌తో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట
- గ్రామాల వారీగా కలెక్టర్‌కు నివేదికలు

మరో మినీ గోవాగా వాడరేవు, రామాపురం, సూర్యలంక ప్రాంతాలు మారాయి. పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందింది. వారాంతపు సెలవుల్లో సేద తీరడానికి వేలాది మంది సముద్ర తీరానికి వస్తున్నారు. బస చేసేందుకు కనీసం రిసార్టులు దొరికే అవకాశం లేకుండా పోతోంది. దీనిని క్యాష్ చేసుకునేందుకు బడా బాబులు అక్రమ నిర్మాణాలకు తెరతీశారు. పర్యాటకుల భద్రత, అనుమతులు పక్కన పెట్టారు. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిని పరిగణలోకి తీసుకోకుండా ఇబ్బడిముబ్బడిగా అక్రమ రిసార్టులు, రెస్ట్ హౌస్‌లు, లాడ్జిలు నిర్మించేశారు. ఇప్పుడు ప్రభుత్వం కళ్లు తెరిచింది. రిసార్టులకు కళ్లెం వేయడానికి రంగం సిద్ధం చేస్తోంది.

చీరాల: సూర్యలంక, వాడరేవు, రామాపురం ప్రాంతాల్లో 40 నుంచి 50 వరకు ఈ రిసార్టులు, లాడ్జిలున్నాయి. వీటిల్లో చాలా వాటికి అనుమతులు లేవు. దీనికి అడ్డుకట్ట వేయాలని ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అన్ని గ్రామాలు, మండలాల్లో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) మరింత విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ప్లాన్ ఖరారు చేసి ఆమోదం కోసం కలెక్టర్‌కు నివేదిక పంపాయి. దీంతో ప్రజాభిప్రాయసేకరణ కూడా జరగనుంది. ఇదే జరిగితే జిల్లాలోని చాలా గ్రామాలు ఈ చట్టం పరిధిలోకి వస్తాయి.



సీఆర్‌జెడ్ పరిధిలో ఏర్పాటు చేసిన రిసార్టు

సీఆర్‌జెడ్ పరిధి పెంపు

సీఆర్‌జెడ్ -2011 స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం సీఆర్‌జెడ్- 2019ను అమలు చేసేందుకు నిర్ణయించింది. ఇది సముద్ర తీరానికి 500 మీటర్లు (అర కిలోమీటర్ లోపు ఉన్న ప్రాంతాలకు) వర్తిస్తుంది. దీనికి మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, తీరప్రాంత పర్యావరణ పరిరక్షణ గ్లోబల్ వార్మింగ్ నియంత్రణ తదితర కారణాలను పేర్కొంది. సీఆర్‌జెడ్ అమలైతే తీరప్రాంతంలో అనుమతులు లేకుండా సుమారు 40 రిసార్టులను అధికారులు తొలగించే అవకాశం కూడా ఉంది. చాలా రిసార్టులకు సీఆర్‌జెడ్ అనుమతి, ఒడా (ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అనుమతి, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేవు. రిసార్టుల్ని హడావుడిగా నిర్మించారు. కొందరు సీఆర్‌జెడ్ పరిధికి లోబడి నిర్మాణాలు చేసినప్పటికీ నిబంధనల్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నారు. తీరం ఒడ్డునే భారీ సెట్టింగ్‌లు వేసి డీజేలతో పార్టీలను నిర్వహిస్తున్నారు. అనేక పార్టీలను రాత్రి వేళల్లో ప్రమాదకర పరిస్థితుల్లో నిర్వహించడం విశేషం.

మడ అడవుల తొలగింపు

సముద్ర కెరటాల నుంచి మత్స్యకార గ్రామాల్ని రక్షించే మడ అడవులను రిసార్టు యాజమాన్యాలు విచ్చలవిడిగా తొలగిస్తున్నాయి. వ్యాపారాల అవసరాల కోసం మైదాన ప్రాంతాలుగా చేశారు. ఇది చట్టపరంగా నేరం. కాసులకు కక్కుర్తి పడి పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సీఆర్‌జెడ్ పరిధిలో ముందు రిసార్టులకు ప్రమాదం పొంచి ఉంది. జిల్లాలో 20 పైగా తీరప్రాంత గ్రామాలు దీని పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం సీఆర్‌జెడ్‌కు సంబంధించిన నివేదిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయానికి సిద్ధంగా ఉంది.



రిసార్టుల నిర్మాణానికి మడ అడవులను తొలగించి చదును చేసిన మైదానం

సైడ్ ఇవ్వలేదనే చంపేశారు

- ఆరీఫ్ హత్య కేసులో ఆరుగురు అరెస్టు
- పరారీలో మరో ఇద్దరు
- వారం రోజుల్లోనే నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ విఠలేశ్వర్

చీరాల: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈపురుపాలేనికి చెందిన ముస్లిం యువకుడు సయ్యద్ అమీన్ ఆరీఫ్ (18) హత్య కేసులో నిందితుల్ని ఎట్టకేలకు చీరాల పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాల్ని సోమవారం రాత్రి జిల్లా ఏఎస్పీ విఠలేశ్వర్ చీరాల టూటౌన్ పోలీస్ స్టేషన్లో వెల్లడించారు. ఈపురుపాలేనికి చెందిన సయ్యద్ ఆరీఫ్, మనోజ్‌లు చీరాల నుంచి ఈపురుపాలెం వెళ్తుండగా ఆదినారాయణపురం సమీపంలో వెనుకనుంచి ఒక కారు గట్టిగా హారన్ కొట్టడంతో పాటుగా ''ఏరా.. మీరేమైనా లవర్సా ? రోడ్డుపై మాట్లాడుకుంటూ వెళ్తున్నార'ని అందులోని వారు దుర్భాషలాడారు. ''అన్నా.. మీరు సరిగ్గా మాట్లాడండి'' అని ఆరీఫ్, మనోజ్‌లు అన్నారు. దీంతో కారు దిగిన ఐదుగురు ఇద్దరిపై దాడి చేశారు. అయితే హతుడు ఆరీఫ్ కూడా దాన్ని ఎదుర్కొనే ప్రయత్నం చేశాడు. దీంతో కారులో నిత్యం ఉండే కత్తితో మల్లి సందీప్ రతన్‌కుమార్, గరిక మహేంద్ర, షేక్ జిలానీలు ఆరీఫ్‌ను విచక్షణారహితంగా పొడిచి చంపేశారు. దీనికి బాపట్లకు చెందిన షేక్ మహ్మద్ రియాజ్, కావలికి చెందిన పాశం లక్ష్మీనారాయణ, స్టువర్టుపురానికి చెందిన దేవరకొండ శ్రీనివాసరావు, రామకృష్ణాపురానికి చెందిన కర్రెద్దుల వంశీ సహకరించారు. ఈనెల 6న రాత్రి 9:30 గంటలకు హత్య చేసి పరారైన నిందితుల కోసం డీఎస్పీ జగదీష్ నాయక్, ఆరుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, 70 మంది పోలీసు సిబ్బంది 10 బృందాలు ఏర్పడి నిందితుల కోసం తీవ్రంగా గాలించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఈ హత్య కేసును సీరియస్‌గా తీసుకుని సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించారు. ఈ హత్యకు ఏపీ 07 డీడీ 9603 సఫారీ స్టోమ్ కారును వినియోగించారు. నిందితులు సోమవారం చీరాలలోని ఒక లాయర్‌ను కలిసేందుకు వస్తుండగా పోలీసులు కాపుకాసి వాడరేవు రోడ్డు వద్ద అరెస్టు చేశారు. హత్యకు వినియోగించిన ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నామని ఏఎస్పీ తెలిపారు. వీరిలో గరికా మహేంద్ర, కర్రెద్దుల వంశీలు పరారీలో ఉన్నారని, వీరిని త్వరగా అరెస్టు చేస్తామని ఏఎస్పీ తెలిపారు. వారం రోజుల వ్యవధిలోనే కేసును ఛేదించిన టూటౌన్ సీఐ సోమశేఖర్, 10 బృందాల్ని ఎస్పీ అభినందించారు. నిందితులకు పక్కాగా శిక్ష పడేందుకు సాక్ష్యాలు సేకరించామని, హత్యలో పాల్గొన్న వారికి కఠిన శిక్షలు తప్పవని ఏఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ జగదీష్, నాయక్, సీఐలు సోమశేఖర్, ఎస్. సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులు ఒక్కొక్కరిపై 12 కేసులు, రౌడీషీట్లు

ఆరీఫ్ హత్య కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మల్లె సందీప్‌పై 12 కేసులు వివిధ స్టేషన్లలో నమోదు కాగా రౌడీషీట్ కూడా ఉంది. ఏ–2గా ఉన్న గరికా మహేంద్ర హత్యాయత్నం వంటి 12 కేసుల్లో ముద్దాయి కాగా రౌడీషీట్ ఉంది. జిలానీపై కూడా 12 కేసులు, రౌడీషీట్ ఉంది. మిగిలిన ముద్దాయిలపై కూడా పలు స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. ఆరీఫ్ హత్య కేసులో నిందితులు అందరూ నేర చరిత్ర కలిగిన ఉన్న వారే కావడం విశేషం.



వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

మట్టి మాఫియాపై కదిలిన యంత్రాంగం



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ, మైనింగ్, ఫారెస్ట్ అధికారులు



స్వాధీనం చేసుకున్న జేసీబీ

- మైనింగ్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించిన ఫారెస్ట్, మైనింగ్, రెవెన్యూ అధికారులు
- జేసీబీ, మూడు టిప్పర్లు స్వాధీనం
- కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్

మార్టూరు: గ్రావెల్ అక్రమ దందా నిర్వహిస్తున్న ప్రాంతాలపై సోమవారం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జేసీబీతో పాటు మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మార్టూరు మండలంలోని ఇసుక దర్శి సమీపంలోని నాగరాజుపల్లి కొండ పరిధిలో, ద్రోణాదుల కొండలపై తెలుగుదేశం నాయకుల ఆధ్వర్యంలో అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను భారీ స్థాయిలో తవ్వుతున్నారంటూ సోమవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనాలపై అధికారులు స్పందించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నాగరాజుపల్లి గ్రామ పరిధిలోని కొండపై సర్వే నంబర్–475లో అదే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడి కనుసన్నల్లో ఇటీవల భారీగా గ్రావెల్‌ను తవ్వి, ప్రతి రోజు వందలాది వాహనాలతో అక్రమంగా తరలించడం మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో ఆ ప్రాంతాన్ని బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్, మైనింగ్ ఆర్ఐ రాజు, జియాలజిస్ట్ ఫణి, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వేటపాలెం సెక్షన్ ఆఫీసర్ వై.జాన్సన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్, మార్టూరు తహశీల్దార్ ప్రశాంతితో కలిసి తనిఖీ చేశారు.

చర్యలు తీసుకుంటాం

అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతున్న జేసీబీతో పాటు మూడు టిప్పర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు మైనింగ్ ఏడీ రాజశేఖర్ తెలిపారు. వాటిని స్థానిక పోలీస్ స్టేషన్ తరలించి, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వై. జాన్సన్ మాట్లాడుతూ నాగరాజుపల్లి గ్రామ పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ 375 పరిధిలో 377 ఎకరాలు తమ శాఖకు చెందిన భూమిగా చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రావెల్ అక్రమ మైనింగ్ తమ పరిధిలోకి రాదని చెప్పారు. నాగరాజు పల్లి గ్రామ సర్వే నంబర్ 475లో మైనింగ్, రెవెన్యూ శాఖల పరిధిలో గల భూమిలో మైనింగ్ జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు. తహసీల్దార్ టి. ప్రశాంతి విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మార్వోగా తాను బాధ్యతలు చేపట్టి పది రోజులు కూడా కాలేదని, అక్రమ గ్రావెల్ మైనింగ్ విషయంపై ఇప్పుడిప్పుడే సమాచారం సేకరిస్తున్నానని చెప్పారు. నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు ఫారెస్ట్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆర్ఐ బాషా, నాగరాజుపల్లి వీఆర్వో రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రజలకు తక్షణమే మేలు జరిగేలా అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ జె. వెంకట మురళి అధికారుల్ని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వినతి పత్రాలు అందించారు. మొత్తం 155 అర్జీలు వచ్చాయి. తన పరిధిలోని వాటికి అక్కడికక్కడే కలెక్టర్ పరిష్కార మార్గం చూపారు. మిగిలినవి పరిశీలన, విచారణ చేయాలంటూ సంబంధిత అధికారుల్ని ఆదేశించారు.

15 నుంచి రెవెన్యూ సదస్సులు

రెవెన్యూ సదస్సుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సదస్సుల్ని ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదవుతున్న అర్జీలలో 60 శాతం రెవెన్యూకి సంబంధించిన సమస్యలే ఉండడంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 277 రెవెన్యూ గ్రామాల్లో 45 రోజులపాటు సదస్సులు జరుగుతాయని, నిర్వహణపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారుల్ని ఆయన ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులుగా గతంలో నియమితులైన జిల్లా అధికారులే సదస్సుల నిర్వహణకు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారని వెల్లడించారు. రెవెన్యూ దస్త్రాలు, గ్రామ మ్యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో, అటవీశాఖ, సర్వే ల్యాండ్స్ రికార్డులు, దేవదాయ శాఖ అధికారులతో మండల స్థాయి బృందాల్ని నియమించాలని సూచించారు. రెవెన్యూ శాఖ నుంచి ఒకరు బాధ్యులుగా వ్యవహరించాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు జారీ చేసిన పట్టాదారు పాసు పుస్తకాల్ని తిరిగి తీసుకుని, వాటి స్థానాల్లో కొత్త వాటిని పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. బాపట్ల జిల్లాలో సదస్సుల నిర్వహణపై పరిశీలకునిగా సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్

స్వాతంత్య్ర దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలి

స్వాతంత్య్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవంపై జిల్లా అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.వర్షాలు కురిసినా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, జిల్లా అభివృద్ధిని చాటి చెప్పేలా శకటాల ప్రదర్శన ఉండాలని ఆదేశించారు. ప్రజల్ని అలరించేలా ఉండాలని సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అర్థమయ్యేలా స్టాల్స్‌లో ప్రదర్శించాలని సూచించారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలకు అవగాహన అవసరం

ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు.''మీకు తెలుసా ? ''కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రచార కరపత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. తొలుత పట్టణంలో ప్రదర్శన చేపట్టారు. ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 11వరకు ''మీకు తెలుసా ?'' కార్యక్రమం నిర్వహిస్తునట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ సుబ్బారావు, డీఆర్వో సత్తిబాబు,జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ, ఏపీ శాక్స్ సీపీఎం జానీబాషా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై పచ్చమూకల దాడి




గాయపడిన ఆంజనేయులు

రేపల్లె రూరల్: రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇలాకాలో పచ్చనేతలు ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం బలుసులపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పులిగుజ్జు ఆంజనేయులుపై అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, మరికొందరు టీడీపీ నాయకులు సోమవారం దాడికి తెగబడ్డారు. కర్రలతో ఆంజనేయులపై దాడిచేసి ఒళ్లంతా వాతలు తేలేలా చావబాదారు. తనపై ఎందుకు దాడికి పాల్పడుతున్నావని ప్రశ్నించిన ఆయన్ను తీవ్రంగా కొట్టారు. ''అధికారం మాది నిన్ను చంపినా అడిగే దిక్కులేదు' అంటూ నిష్కారణంగా దాడికి పాల్పడ్డారని ఆంజనేయులు వాపోయాడు.



ఆంజనేయులు కాలిపై గాయాలు

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి




వెంకటరెడ్డి (ఫైల్)

పెదకూరపాడు: ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. 75 త్యాళ్లూరు గ్రామానికి చెందిన కొల్లి కోటిరెడ్డి కుమారుడు వెంకటరెడ్డి (27) విద్యుత్ శాఖలో పనిచేస్తుంటాడు. కూటమి ప్రభుత్వం రాగానే చిరు ఉద్యోగులను తొలగించిన నేపథ్యంలో తమ్ముడు గోవర్ధన్‌రెడ్డితో కలిసి వ్యవసాయం చేసుకుంటున్నాడు. ట్రాక్టర్ ద్వారా సొంత భూమిలో పత్తి పంటలో గుంటక తోలి డొంక రోడ్డుకు ట్రాక్టర్ ఎక్కించే క్రమంలో అదుపు తప్పి పక్కనే ఉన్న బావిలో ట్రాక్టర్ సహా పడి మృతి చెందాడు.

పానకంలో పుడక

- నృసింహుని పానకం వేలంలో మంత్రి పీఏ జోక్యం
- అతడి ఆదేశాలతో బేజారైన అధికారులు
- పాట రద్దు చేసి వెంటనే మళ్లీ పెట్టాలని కమిషనర్ ఆదేశాలు
- టెండర్లు లేకుండా నేరుగా తమ వాళ్లకే ఇవ్వాలని టీడీపీ నేతల ఒత్తిళ్లు

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి పానకం వేలం పాట వివాదాస్పదంగా మారింది. గత ఏడాది వేలంపాట జరిగింది. ఈ ఏడాది అక్టోబర్ 21 వరకు పాత పాటదారుడికి హక్కులున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెలలో అధికారులు మళ్లీ వేలం పాటకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే, ఇంతలోనే టీడీపీ నేతలు కొందరు మంత్రి పీఏ అరుణ్ దృష్టికి తీసుకెళ్లి అధికారులకు ఫోన్లు చేయించి, పాత పాటను రద్దు చేయించారు. రాజకీయ జోక్యంతో అధికారులు ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. మంత్రి పీఏ ఫోన్లలోనే ఆదేశాలు జారీ చేయడంపై ఉన్నతాధికారులూ విస్తుపోతున్నారు. అతడి ఒత్తిళ్లు భరించలేని దేవదాయ శాఖ కమిషనర్ పాటను రద్దు చేసి వెంటనే మళ్లీ టెండర్లు పిలవాలని ఆదేశాలు జారీచేశారు. అయితే, టెండర్లు కాకుండా నేరుగా తమ వాళ్లకే పానకం హక్కులు ఇవ్వాలని టీడీపీ నాయకులు కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏం చేయాలో పాలుపోక ఆలయ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. విధులకు హాజరయ్యేందుకూ వణికిపోతున్నారు.



జాతీయ పోటీల్లో పతకాలే లక్ష్యం

- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- జేఎన్‌వీలో ప్రారంభమైన ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు
- 4 రాష్ట్రాలు.. 8 జిల్లాల నుంచి 430 మంది క్రీడాకారులు హాజరు
- మద్దిరాల నవోదయ విద్యాలయంలో మూడు రోజులు క్రీడా పండుగ

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: జాతీయ క్రీడల్లో పతకాల సాధనే లక్ష్యంగా క్రీడాకారులు కృషి చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం సోమవారం జేఎన్‌వీ పరిధిలో జరిగే ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు వేదికగా నిలిచింది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. మూడు రోజులపాటు జరిగే ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ సత్తా చాటి జాతీయస్థాయి పోటీల్లో అర్హత సాధించేందుకు సిద్ధం అయ్యారు. ఇందుకోసం కాలికట్, కోలార్, మహబూబ్‌నగర్, నెల్లూరు, రాయచూర్, విశాఖపట్నం, షిమోగ, త్రిశూల్ ప్రాంతాలకు చెందిన 430 మంది క్రీడాకారులు, తమ పీఈటీలు, ఎస్కార్ట్‌లతో తరలివచ్చారు. తొలిరోజున పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేఎన్‌వీ విద్యాలయ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థినులు పూర్ణకుంభంతో హారతులిచ్చి సాదరంగా స్వాగతించారు. విద్యాలయం నుంచి క్రీడా మైదానానికి చేరుకుని కళావేదికపై ప్రార్థన గీతాల్ని ఆలపించారు. స్వాగత నృత్యాలతో విద్యార్థినులు ఆహుతులను అలరించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తూ గౌరవ వందనం చేయగా, కలెక్టర్ స్వీకరించారు. తొలుత కలెక్టర్ పి.అరుణ్‌బాబు క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, అతిథులతో క్రీడాజ్యోతిని వెలిగించి ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్ని ప్రారంభించారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ పి అరుణ్‌బాబు, పక్కన వీరనారాయణ, ప్రిన్సిపాల్ నరసింహారావు

నిత్య జీవితంలో క్రీడలు భాగం కావాలి

ధనలక్ష్మి గ్రూప్స్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ మాట్లాడుతూ ఆటల్లో ప్రతిభ చూపే విద్యార్థులు సంపూర్ణమైన అభివృద్ధిని సొంతం చేసుకుంటారని వివరించారు. జీవితంలో గెలుపోటములు సమానంగా తీసుకునే సత్తా ఆటగాళ్లకే ఉంటుందన్నారు. విద్యార్థి దశలో క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలని..ఏ రంగంలోనైనా మనస్సు పెట్టి సాధన చేస్తే సాధ్యం కానిది లేదన్నారు. అధ్యక్షత వహించిన విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు మాట్లాడుతూ కఠోర సాధనే విజయానికి సోపానం అవుతుందన్నారు. పతకాలు సాధించాలంటే క్రీడల పట్ల ఆసక్తిని చూపి పోటీకి సిద్ధం కావాలన్నారు. ప్రస్తుతం తమ విద్యాలయంలో జరిగే పోటీల్లో గెలిచి జాతీయస్థాయిలో కీర్తిపతాకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ హుస్సేన్, జేఎన్‌వీ వైస్ ప్రిన్సిపాల్ రత్నాంబిక, జేఎన్‌వీ పీఈటీ కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, అయిరెడ్డి రవిప్రసాద్, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 12 మ్యాచ్‌లు

చిలకలూరిపేటటౌన్: జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులకు సోమ, మంగళ, బుధవారాల్లో జరిగే ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు మద్దిరాల పీఎంశ్రీ నవోదయ విద్యాలయం క్రీడామైదానంలో తొలిరోజు ఉత్సాహంగా ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలకు 8 జెఎన్‌వీ క్లస్టర్లకు చెందిన 430 క్రీడాకారులు, 12 రిఫరీలు, 10 మంది పీఈటీలు, 40 మంది ఎస్కార్ట్‌లు వచ్చారు. హ్యాండ్‌బాల్ పోటీలను బాలుర, బాలికల వేర్వేరుగా అండర్-14, అండర్ -17, అండర్ -19 విభాగాల్లో నిర్వహించారు. సోమవారం మొత్తం 18 మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి. అండర్ 14,17,19 విభాగాల్లో 9 జట్లు బాలురు, బాలికల విభాగంలో తొమ్మిది జట్లు పాల్గొన్నాయని పీఈటీ కిషోర్‌కుమార్ తెలిపారు.



తలపడుతున్న బాలికల జట్లు



హ్యాండ్‌బాల్ క్రీడలో పోటాపోటీగా ఆడుతున్న క్రీడాకారులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

క్లుప్తంగా

నక్సలైట్ అమర్నాథ్‌రెడ్డి లొంగుబాటు

వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం మండలం ఓరుగంటి రెడ్డి వీధికి చెందిన నక్సల్ దళ సభ్యుడు దొడ్ల తేజ అమర్నాథ్ రెడ్డి(26) తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా ఎస్పీ ఎదుట సోమవారం రాత్రి లొంగిపోయాడు. అతడితో పాటు గాలి నారాయణరెడ్డి కూడా లొంగిపోయాడు. అమర్నాథ్ రెడ్డి, ఓరుగంటి రెడ్డి వీధిలో ఉండే ముసలారెడ్డి పెద్ద కుమారుడు. ముసలారెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఐదేళ్ల కిందట పెద్ద కుమారుడు అమర్నాథ్ నక్సల్స్ సిద్ధాంతాలకు ఆకర్షితుడై దళంలో చేరిపోయాడు. ఆ ఉద్యమం ద్వారా సాధించేది ఏమీ లేదని జనజీవన స్రవంతిలో కలవడానికి నిశ్చయించుకొని లొంగిపోయినట్లు సమాచారం.

శతాధిక వృద్ధురాలి మృతి



పెదకాకాని: శతాధిక వృద్ధురాలు భీమిరెడ్డి సుబ్బమ్మ(101) మృతి చెందింది. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన భీమిరెడ్డి సుబ్బమ్మ భర్త వీరారెడ్డి 36 సంత్సరాల కిందట మరణించాడు. సుబ్బమ్మకు ఐదుగురు మగ, ఒక ఆడ సంతానం. 101 సంత్సరాలు జీవితంలో సుబ్బమ్మ కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు, మునిమనువరాళ్లను చూసింది. రెండు రోజులుగా ఆమె శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతుంది. సోమవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచింది. పెద్ద ఎత్తున బంధుమిత్రులు, గ్రామ ప్రజలు సుబ్బమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం నంబూరు హిందూ శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి చెప్పారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం జెడ్పీ ఆవరణలోని బాలికా సదనంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లల గదులు, ఆహారం, వైద్యసేవలు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. విద్య వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జీవన జ్యోతి, రక్షణాధికారి బి.విజయకుమార్ పాల్గొన్నారు.

పాతకక్షల నేపథ్యంలో కత్తితో దాడి

చీరాల: పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై మరికొందరు యువకులు కత్తితో దాడిచేశారు. ఈఘటన ఆదివారం రాత్రి మండలంలోని బోయినవారిపాలెంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు అందించిన వివరాలు.. మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని బోయినవారిపాలేనికి చెందిన బోయిన పద్మ, అదే గ్రామానికి చెందిన కోటి మోహనకృష్ణ, బోయిన గోపిరాజు, కోటి శ్రీను, బోయిన వెంకటేశ్వర్లుకు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మోహనకృష్ణ, గోపిరాజు, శ్రీను, వెంకటేశ్వర్లు మూకుమ్మడిగా కిషోర్ అనే వ్యక్తిపై కత్తులతో దాడిచేసి గాయపరిచాడు. రక్తగాయాలైన బాధితుడిని అంబులెన్స్‌లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ సంఘం జిల్లా నూతన కార్యవర్గం

మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖపట్నంలో ఈనెల 11వ తేదీన నిర్వహించిన ఎన్నికలలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సుభానిలను ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బి.ప్రసాద్‌లను ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్ అభినందించారు.

రేపు జిల్లా స్థాయి షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపిక నిర్వహిస్తామని కార్యదర్శి ఎం.కిషోర్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను బుధవారం మేడికొండూరు మండలం, మందపాడు గ్రామంలోని శ్రీనివాస హైస్కూల్లో ఏర్పాటు చేస్తామన్నారు.

కర్రసాము పోటీలకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీలలో విజయం సాధించిన చిన్నారులతో చైర్మన్ ఏడుకొండలు

చెరుకుపల్లి: సిలంబం(కర్రసాము) పోటీలలో రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపిక కావటం సంతోషదాయకమని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండల రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన గుంటూరులో నిర్వహించిన సిలంబం(కర్రసాము) 14వ రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్-11, అండర్-14, అండర్-17 విభాగాల్లో విజయం సాధించి వారు జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరిలో డి.వేదాక్ష చౌదరి, ఎం.తెజస్ రెడ్డి, వై.చేతన్, వై.రాఘవ్, అర్.ఫణ్ముక వంశీ, ఎం.మోక్షణాథ్, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించినట్లు చెప్పారు. వీరు, సెప్టెంబర్‌లో గోవాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కర్ర సాము పోటీలలో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయికి ఎంకైన చిన్నారులను ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ వైస్ చైర్మన్ పైనం గణేష్‌రెడ్డి, సెక్రెటరీ సాయిరంగా రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు నాంచారయ్య అభినందించారు.

ఆరుగురికి బంగారు పతకాలు

తెనాలిఅర్బన్: జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కఠెవరం గ్రామానికి చెందిన నివాస్ కరాటే, మార్షల్ ఆర్ట్స్ అకాడమి విద్యార్థులకు ఆరు బంగారు బహుమతులు, ఏడు వెండి బహుమతులు కైవసం చేసుకున్నారు. ఎంఎంటీ టీమ్ ఆధ్వర్యంలో పోటీలు ఆదివారం తెనాలిలో నిర్వహించారు.

సామాజిక ఇతివృత్తాలే శింగమాల కథలు

సాక్షి, అమరావతి: మానవ జీవన సంఘర్షణ, సామాజిక సమస్యల ఇతివృత్తాలతో శింగమాల సుబ్రహ్మణ్యం అద్భుత కథా రచనలను సృష్టించారని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం వెలగపూడిలో సచివాలయ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో సచివాలయంలో ప్రముఖ రచయిత, రాష్ట్ర సచివాలయ అధికారి శింగమాల సుబ్రహ్మణ్యం రాసిన కథల సంపుటి 'వెలుగు పూలు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ప్రజాశక్తి బుక్ హౌస్ వర్కింగ్ ఎడిటర్ వొర ప్రసాద్, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సీఈఓ గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, సచివాలయ సాంస్కృతిక సంఘం అధ్యక్షుడే డి.స్వర్ణరాజు, సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.శ్రీకృష్ణ, పురపాలకశాఖ సహాయ కార్యదర్శి టి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సూక్తి సుధలు ఖండకావ్య ఆవిష్కరణ

అద్దంకి: నిరంతం సాహితీ పరిశ్రమ చేయడమే విద్వాన్ జ్యోతి చంద్రమౌళి పని అని విశ్రాంత ఆర్జేడీ యూ దేవపాలన అన్నారు. స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన 'సూక్తి సుధలు' ఖండ కావ్య ఆవిష్కరణ సభ సోమవారం నిర్వహించారు. ఈసభకు పాఠశాల హెచ్ఎం సువర్ణ పద్మావతి అధ్యక్షత వహించారు. దేవపాలన, అన్నంనేని వెంకటారవు గ్రంథ సమీక్ష చేశారు. తొలుత పాఠశాల ఆవరణలో సరస్వతీ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రంథాన్ని మండలాల్లోని జార్లపాలెం వాసి మద్రాసు తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యుడు విస్తాలి శంకరరావు ఆవిష్కరించారు. గ్రంథాన్ని చంద్రమౌళి తన గురువు నాగయ్యకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా దేవపాలన మాట్లాడుతూ చంద్రమౌళి మాస్టారు రచించిన గ్రంథాలయ వరసలో 26వ పుస్తకంగా సూక్తి సుధ చేరిందన్నారు. ఈ ఖండకావ్యంలో ఆయన పోతులూరి వీరబ్రహ్మం, గాంధీ, వేమన, అంబేడ్కర్, రాజయకీయ వేత్త నాగిరెడ్డి వంటి ప్రముఖల గురించి పద్యాలు రాశారని చెప్పారు. కులాల కుళ్లు నుంచి, ఓటు విక్రయం, రాజకీయం గురించి స్పష్టంగా రాశారని చెప్పారు. సాహితీ విశ్లేషకుడు అన్నంనేని వెంకట్రావు మాట్లాడుతూ ఈ గ్రంథం 175 పద్యాల సంకలనంతో రాసి కావ్యం సరళ, సుందరమైన భాషలో అందరికీ అర్థమయ్యే విధంగా రాశారని చెప్పారు. మద్రాసు తెలుగు యూనివర్సిటీ ఆచార్యుడు విస్తాలి శంకరరావు మాట్లాడుతూ వేమన శతక వరసలో ఈ కావ్యం చేరుతుందన్నారు. సీహెచ్ నాగభూషణం వేమన పద్యాలను ఉటంకిస్తూ, ఆ పద్యాలను పోలిన పద్యాలను విద్యార్థులకు తెలియజెప్పారు. తరువాత వీరవల్లి సుబ్బారావు, గాడేపల్లి దివాకరదత్తు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. పాఠశాల ఆధ్వర్యంలో చంద్రమౌళి మాస్టారును ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అదే విధంగా సాహితీవేత్తలు దుశ్శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జే పంగులూరు ఎంఈఓ వీరాంజనేయులు, మన్నం త్రిమూర్తులు, సీహెచ్ నాగేశ్వరరావు, శ్రీమన్నారాయణ మూర్తి పాల్గొన్నారు.



సూక్తి సుధలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

కిలోన్నర గంజాయి స్వాధీనం



అరెస్టయిన వారితో సీఐ భాస్కర్

పొన్నూరు: పట్టణ పరిధిలో గంజాయి పట్టుబడిన కేసులో నలుగురిని అరెస్టు చేసి వీరి వద్ద నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ పి.భాస్కర్ తెలిపారు. స్థానిక స్టేషన్‌లో సోమవారం వివరాలు వెల్లడించారు. చెడు వ్యసనాలకు బానిసలైన గుంటూరుకు చెందిన షేక్ జబిరుల్లా, ఉప్పు కార్తిక్, షేక్ ఇషాక్, పొన్నూరు డీవీసీ కాలనీకి చెందిన దేవరకొండ రాజ్‌కుమార్, ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడుకు చెందిన ఇర్ల చైతన్య, గంజాయి తాగడంతో పాటు డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో గంజాయి విక్రయాలకు అలవాటు పడ్డారు. ఈ నేపథ్యంలో ఉప్పు కార్తీక్ వద్దనున్న కిలోన్నర గంజాయిని వాటాలు వేసుకుని పట్టణ పరిధిలోని ఇంటూరు అడ్డరోడ్డు వద్ద విక్రయించేందుకు సిద్ధమవ్వడంతో పోలీసులు ఆకస్మిక దాడులు చేసి యువకులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో నలుగురిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. షేక్ జబిరుల్లా పరారీలో ఉన్నాడని అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ భాస్కర్ చెప్పారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

లక్ష్మీపురం: దేశ స్వాతంత్య్ర పోరాటంలో భాగస్వాములు అయిన విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో (ఏఐఎస్‌ఎఫ్) ఆవిర్భావ దినం సోమవారం నిర్వహించారు. తొలుత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే ఒలంపిక్స్‌లో భారత్ పతకాలు సాధనలో విఫలమైందని పేర్కొన్నారు. అమెరికా, చైనా, జపాన్ లాంటి దేశాలు అద్భుత ప్రతిభ చూపుతుంటే భారత్ మాత్రం 71వ స్థానానికి పరిమితమైందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నాయకులు మేడా హనుమంతరావు, రాజశేఖర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జంగాల చైతన్య, వలి, యశ్వంత్, కిరణ్, శివా, నవ్యశ్రీ, డేవిడ్, అమర్నాథ్, కిరణ్, అజయ్, బన్నీ పాల్గొన్నారు

ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పట్నంబజారు: ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై చోటుచేసుకుంది. పాత గుంటూరు ఎస్ఐ పి.భాగ్యరాజ్ తెలిపిన వివరాలు.. తెనాలి డిపో నుంచి సోమవారం గుంటూరు వస్తున్న బస్సులో మార్గంమధ్యలో గుర్తు తెలియని ఒక వ్యక్తికి ఫిట్స్‌లా వచ్చాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు సాయం అందించటంతో తేరుకున్నాడు. అయితే, గుంటూరు బస్టాండ్‌కు చేరుకునే సరికి సీటులో మృతి చెందాడు. బస్ కండక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పాత గుంటూరు ఎస్ఐ భాగ్యరాజ్ ఫోన్ నంబర్ 8688831329కు సమాచారాన్ని అందించాలని కోరారు.

లారీ కింద పడి మహిళ దుర్మరణం



లారీ చక్రం కింద పడి మృతి చెందిన మహిళ దృశ్యం

పెరవలి పాలెం(వేమూరు): లారీ కింద పడి మహిళ మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామానికి చెందిన కూచిపూడి జ్యోతి(39) బ్యాంకు పని నిమిత్తం కూతురు శాశ్వతతో కలసి ద్విచక్ర వాహనంపై పెరవలిపాలెం వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి వేజండ్ల వెళ్తున్నారు. శాశ్వత బైక్ నడుపుతోంది. గ్రామ శివారులో అదే సమయంలో ఎదురుగా లారీ వస్తోంది. పక్కనే రోడ్డు మార్జిన్‌లో వెళ్లే సమయంలో బైక్ అదుపుతప్పింది. దీంతో బైక్ వెనక కూర్చున్న తల్లి జ్యోతి లారీ వెనక చక్రం కింద పడింది. తల నుజ్జునుజ్జు అయింది. లారీ డ్రైవర్ పరార్ అయ్యాడు. జ్యోతి భర్త ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కూతురు శాశ్వతను పెరవలిపాలెం ఇచ్చారు. అయితే భర్తతో మనస్పర్థలతో తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఘటనపై గ్రామస్తులు వేమూరు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు వేమూరు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

పోటాపోటీగా ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- పురుషుల విభాగంలో గుంటూరు..
- మహిళా విభాగంలో విజయనగరం జట్లు విజయం



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ఇన్నారెడ్డి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గుడ్ షపర్డ్ పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ముగిశాయి. విజేతలైన వారికి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నా రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పురుషుల విభాగంలో గుంటూరు, మహిళా విభాగంలో విజయనగరం జట్లు విజయం సాధించి ప్రథమస్థానంలో నిలిచాయి. పురుషుల విభాగంలో రెండవ స్థానంలో అనంతపురం, మూడవ స్థానంలో నెల్లూరు, నాల్గవ స్థానంలో విజయనగరం జట్లు నిలిచాయి. మహిళా విభాగంలో రెండవ స్థానంలో అనంతపురం, మూడవ స్థానంలో గుంటూరు, నాల్గవ స్థానంలో కర్నూలు జట్లు నిలిచాయి. వీరిలో జాతీయ స్థాయిలో ఆడే జట్లను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరసింహా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీడీలు చిరంజీవి, సురేష్, రాధాకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో హాషిస్‌కు సిల్వర్ మెడల్

మంగళగిరి: జాతీయస్థాయి స్కేటింగ్‌లో మెరుగుపాల హాషిస్ సిల్వర్ మెడల్ సాధించాడు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు సమీపంలోని పొల్లాచిలో జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలు ఈ నెల 7వ తేదీ నుంచి 11 వరకు నిర్వహించారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డొల్లాస్ నగర్‌కు చెందిన మెరుగుపాల హాషీస్ ప్రతిభ చూపాడు. అండర్- 14 జూనియర్ విభాగంలో హాషిస్ ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో ఆరు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. హాషిస్ కుంచనపల్లి అరవింద స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. ప్రతిభ చూపిన విద్యార్థిని కోచ్ సత్యనారాయణ, స్కూలు యాజమాన్యం అభినందించారు.